క్లుప్తంగా

నేడు వీరఘట్టంలో 'వైఎస్సార్ చేయూత' సభ

వీరఘట్టం: స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో సోమవారం వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఎం శివున్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 5,458 అక్కచెల్లమ్మలకు ఒక్కొక్కరికీ రూ.18,750 చొప్పున రూ.10,40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి లబ్ధిదారులైన అక్కచెల్లమ్మలు హాజరుకావాలని ఆయన కోరారు.

జగనన్నను సీఎం చేసేందుకు సిద్ధం



వప్పంగి గ్రామంలో మేము సిద్ధం అంటూ అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: ప్రజా సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంను చేసేందుకు తామంతా సిద్ధమని కొండవాడ పంచాయతీ వప్పంగి, రెల్ల పంచాయతీ జాపాయి గ్రామస్తులు అంటున్నారు. కొండవాడలో సర్పంచ్ ఎం.కృష్ణారావు ఆధ్వర్యంలో, రెల్లలో సర్పంచ్ ఎం.శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం 'మేలు సిద్ధం- మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కమిటీ సభ్యులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్నకు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గరుగుబిల్లి: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని డా. ఎన్. ఝాన్సీరాణి అన్నారు. డా.వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని సంతోషపురం గ్రామంలో ఆదివారం 'మన గ్రామం- మన విశ్వవిద్యాలయం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అరటి, పామాయిల్, మామిడి తోటల సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కూరగాయల పంటలలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎ.తవిటినాయుడు, కార్యదర్శులు చరణ్ పండిత్, రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.హరిరామకుమార్, తదితరులు పాల్గొన్నారు.

13న వలసబల్లేరులో వైద్యశిబిరం

కురుపాం: మండలంలోని వలసబల్లేరు గ్రామంలో ఈ నెల 13న పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా తమ ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు జెరాక్స్ కాపీలు వెంట తీసుకొని రావాలని కోరారు.



నాడు-నేడుతో సుందరంగా తీర్చిదిద్దిన ప్రాథమిక పాఠశాల



పేదలకు ఇచ్చిన ఇళ్లు



రైతు భరోసా కేంద్రం

కుడ్డపల్లిలో కొత్త పుంతలు



గ్రామంలో నిర్మించిన మురుగుకాలువ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో మౌలిక వసతులు
- సంక్షేమ పథకాలతో మెరుగుపడిన జీవన ప్రమాణాలు



విలేజ్ హెల్త్ క్లినిక్

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిజన గ్రామాలు బాగా అభివృద్ధి చెందాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గిరిజన గ్రామాల్లో రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్య, వైద్యం, తదితర కనీస వసతులు కల్పించింది. ఇందులో భాగంగా కుడ్డపల్లిలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్, రూ.25 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాడు-నేడు కింద రూ.11.40 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేశారు. రూ.1.20 లక్షలతో వీధి కాలువలు నిర్మించారు. అలాగే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద మంజూరైన రూ.40 లక్షలతో సచివాలయం పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

రుణమాఫీ చేశారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేశారు. 2019 ఎన్నికల నాటికి మా సంఘానికి బ్యాంకులో ఉన్న సుమారు రూ.1.05 లక్షలను నాలుగు విడతల్లో అందజేశారు.

– ఎస్.లక్ష్మి, ఆసరా లబ్ధిదారు

ఒకటో తేదీనే పింఛన్ వస్తోంది



ప్రతీ నెల ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు రూ.3 వేలు అందిస్తున్నారు. గతంలో సిగ్నల్ సమస్య వలన అనేక ఇబ్బందులు పడే వాళ్లం. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. జగనన్న దయంతో ఠంచన్‌గా పింఛన్ అందుతోంది.

– సవర బోడమ్మ, పింఛన్ లబ్ధిదారు, కుడ్డపల్లి

పథకం	లబ్ధిదారులు	చెల్లించిన మొత్తం
వైఎస్సార్ ఆసరా	445	రూ.76,20,292
అమ్మ ఒడి	810	రూ.18,037,145
కోవిడ్ సాయం	760	రూ.7,60,000
హౌసింగ్	50	రూ.4,03,795
జగనన్న తోడు	19	రూ.11,544
జగనన్న వసతిదీవెన	61	రూ.5,57,560
జగనన్న విద్యాదీవెన	122	రూ.12,65,861
పాస్టర్ గౌరవ వేతనం	3	రూ.15,000
పింఛన్	476	రూ.46,600,500
రైతు భరోసా	950	రూ.43,923,100
సున్నావడ్డీ పంట రుణాలు	126	రూ.3,54,408
సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీలు)	567	రూ.2,28,608
వాహన మిత్ర	23	రూ.7,50,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	164	రూ.6,67,450
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	210	రూ.3,404,528
వైఎస్సార్ బీమా	10	రూ.1,86,0000
వైఎస్సార్ చేయూత	252	రూ.11,118,750
మొత్తం	5,048	రూ.137,578,541

సమస్యలు వెంటనే పరిష్కారం



నిరుపేదలు ఎటువంటి సమస్యలతో వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం. ఏవైనా అర్జీలు పెట్టుకున్నా కొద్ది సమయంలో క్లియర్ చేయడం జరుగుతోంది. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగజేయకుండా పథకాలు అందిస్తున్నాం. – పాపారావు, గ్రామ కార్యదర్శి, కుడ్డపల్లి

సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో 5,048 మంది లబ్ధిదారులకు రూ.13.75 కోట్లు నిధులు డీబీటీ విధానంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. అలాగే నాన్‌డీబీటీ ద్వారా 1,329 మంది లబ్ధిదారులకు రూ.1.52 కోట్లు లబ్ధి చేకూర్చింది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

సీతంపేట: మాతాశిశు సంరక్షణా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు అన్నారు. స్థానిక వైటీసీలో ప్రిజం-10పై ఐసీడీఎస్, వైద్య సిబ్బందితో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటర్నల్ మోర్టాలిటీ రేట్‌ను వీలైనంత పెంచాలన్నారు. శతశాతం ఇమ్యూనైజేషన ప్రక్రియ జరగాలన్నారు. కౌమర దశ బాలికల వివరాలు గ్రామ సచివాలయాల్లో నమోదు చేయాలని సూచించారు. దత్తత అధికారులు వారికి ఇచ్చిన వివిధ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆశా వర్కర్లు ఈ-ఆశా యాప్‌లో ఈసీ ట్రాకింగ్ చేస్తున్నారో లేదో మోనటరింగ్ చేయాలన్నారు. ఈఓ పీఆర్డీ సత్యం, సీడీపీఓ రంగలక్ష్మి, వైద్యాధికారులు భానుప్రతాప్, సాయిచరణ్, రవీంద్ర పాల్గొన్నారు.

ప్రిజమ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పాలకొండ: ప్రభుత్వం చేపట్టిన ప్రిజమ్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పాలకొండ, వీరఘట్టం మండలాల సచివాలయాల సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆదివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్త హీనతతో బాధపడుతున్న వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

భామిని: మండలంలో మూడు పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ బాధ్యతలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు ఆదివారం దత్తత అధికారులకు అప్పగించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యతలను అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అప్పగించాలని సూచించారు.

పశుసంరక్షణపై అవగాహన

పాలకొండ రూరల్: వేసవిలో ఎండల తీవ్రతకు పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని, పాడిరైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రభామాణిక్యరావు సూచించారు. వేసవిలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ పరిధిలోని పాడిరైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. పశువుల శాలల్లో చల్లదనంతో పాటు గాలి, వెలుతురు దారాళంగా వచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. దాణా విషయంలో మెలకువలు పాటించాలన్నారు. నీటి నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని, గాలికుంటు తదితర వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ప్రజలకు మేలు చేయడం జగనన్న తత్వం
- మోసం చేయడం చంద్రబాబు నైజం
- వైఎస్సార్ చేయూత సభలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: మీ ఇంట్లో మంచి జరిగితేనే, మీ కటుంబంలో సంతోషం ఉంటేనే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన 'వైఎస్సార్ చేయూత' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులకు చేయూత నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తత్వమని, ప్రజలకు మోసం చేయడం చంద్రబాబు నైజమని అన్నారు. గ్రామ సచివాయల వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రతీ గడపకు చేరవేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికె దక్కిందన్నారు. ఎలాంటి అవినీతికి, సిఫార్సులకు తావులేకుండా, అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికలు దగ్గరపడటంతో టీడీపీ నేతలు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్నారని, వారి మాటలు నమ్మితే సంక్షేమ పథకాల కోసం మళ్లీ జన్మభూమి కమిటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికొదిలేసి మహిళలను మోసం చేశారని దుయ్యబట్టారు. జగనన్న ప్రభుత్వంలో మహిళా సంఘాల రుణాలు మాఫీ చేయడంతో పాటు సంఘాలను బలోపేతం చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ రామారావు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల జీవితాల్లో వెలుగులు నిండేలా, సుస్థిరమైన ఆదాయం సంపాదించుకునేలా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు అమలు చేశారని, రానున్న ఎన్నికల్లో మహిళలంతా జగనన్నకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు గంట లక్ష్మి, స్థానిక సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, ఎంపీటీసీ బొంగు గౌరమ్మ, వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి సర్పంచ్‌లు కె.ఇందుమతి, బి.లక్ష్మి, బి.మహేశ్వరరావు, జి.నారాయణమ్మ, నాయుకులు డి.ధనుంజయరావు, ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఇంతకంటే ఏమి కావాలి



ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో మాలాంటి పేదలు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. వైఎస్సార్ చేయూత కింద నాలుగు విడతల్లో రూ.75 వేలు అందుకున్నాను. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి పథకాలతో లబ్ధిపొందాను. – యాళ్ల తవిటమ్మ, ఉమారామలిగేశ్వరస్వామి ఎంపీఎస్, రావివలస

పథకాలతో భరోసా కల్పించారు



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాలుగు విడతలో రూ.75 వేలు అందుకున్నాను. ఆ డబ్బులతో చిన్న వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాను. వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ నిధులు కూడా అందాయి. మహిళలకు ఈ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది.

– ఎం.గౌరమ్మ, సీతారాంపురం, కొంకడివరం పంచాయతీ

అర్హులందరికీ చేయూత



అర్హులందరికీ వైఎస్సార్ చేయూత పథకంను అమలు చేస్తున్నారు. 45- 60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలందరికీ ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.18,750లు చొప్పున అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా పొందిన నగదుతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని అభివృద్ధి చెందుతున్నాం. ఇంటికి చేదోడుగా ఉంటూ జీవనం సాగిస్తున్నాం.

– మరడాన అనపూయ, శ్రీరామా ఎంపీఎస్, టీవీ పురం

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. మండలంలోని తలవరం గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడప వద్ద కళావతికి, విక్రాంత్‌కు ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. జగనన్న పాలన ఎలా ఉంది, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎమ్మెల్యే కళావతి ఆరా తీయగా.. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నే సీఎం అవుతారని ముక్తకంఠంతో చెప్పారు. యువతను తప్పుతోవ పట్టించేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను ఎమ్మెల్యే వివరించారు. యువత ఆలోచనతో ఓటు వేయాలని కోరారు. జై జగన్ నినాదాలతో గ్రామం మార్మోగిపోయింది. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ శిష్టు మధుసూదనరావు, వైశ్యరాజు గోవిందరాజు, బౌరోతు రాజశేఖర్, పాలవలస ధవలేశ్వరరావు, నీలం సత్యంనాయుడు, గేదెల అప్పలనాయుడు, దేవికవాడ భుజంగరావు, కొరికాన సన్యాసినాయుడు, శివ్వాల శ్రీనివాసరావుతో పాటు మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'గడపగడపకు మన ప్రభుత్వం'

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు గ్రామంలో ప్రతీ గడపకు వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. పాలకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మొదటిసారిగా పాలకొండ నగరపంచాయతీలోని నీలమ్మకాలనీలో 2022 మే 11న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. సుమారు 23 నెలలుగా అలుపెరగకుండా నియోజకవర్గంలోని వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని మండలాల్లో పర్యటించారు. మొత్తం 102 సచివాలయాల పరిధిలో 153 పంచాయతీల్లోని 76,771 గృహాలను సందర్శించి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమం పూర్తయిన ప్రతీ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున రూ.20.40 కోట్లు నిధులను విడుదల చేసింది. ఆ నిధులతో ఆయా సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేసిన పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

మిస్సింగ్ కేసు నమోదు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామానికి చెందిని యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎస్.ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న ఆ యువతికి ఇటీవల పెళ్లి కుదిరింది. డ్రెస్సులు కుట్టించుకునేందుకు బొబ్బిలి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీతంపేటలో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు సీఐ చంద్రమౌళి, ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. వారపు సంత మార్కెట్ నుంచి ఐటీడీఏ వరకు కవాతు చేశారు.

మన్యం బంద్ ప్రశాంతం

గుమ్మలక్ష్మీపురం/కురుపాం/సీతంపేట:

ఏజెన్సీలో ఆదివారం నిర్వహించిన మన్యం రాష్ట్ర బంద్ ప్రశాంతంగా ముగిసింది. గిరిజనుల హక్కుల పరిరక్షణ, జీవో 3 పునరుద్ధరణ, స్పెషల్ డీఎస్సీ, విద్యా వలంటీర్ల కొనసాగింపు, ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకు కేటాయింపు, నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాల జాబితాలో చేర్చడం, తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బంద్ చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట మండలాల్లో ఆదివాసీ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఏపీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్, బిడ్డిక అడిత్తో, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, ఎం.తిరుపతిరావు, జె.శ్రీరాములు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, మండంగి శ్రీనివాసరావు, సీఐటీయు నాయకులు జి.వెంకటరమణ, పువ్వల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద నిరసన చేపడుతున్న గిరిజన సంఘం నాయకులు



సీతంపేట: మండల కేంద్రంలో ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు



పాలకొండ రూరల్: ఎల్ఈడీ స్క్రీన్ వద్ద జై జగన్ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు



పాలకొండ రూరల్: జగనన్న పాటలకు నృత్యాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



వీరఘట్టం: దశుమంతపురంలో సీఎం జగనన్న ప్రసంగాన్ని వీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు



భామిని: బిల్లుమడలో స్క్రీన్‌పై సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న కార్యకర్తలు



పాలకొండ: మేము సిద్ధం అంటూ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సిద్ధం సభతో నూతనోత్సాహం

జగన్ అంటేనే జనం.. జనం వెంటే జగన్ అని ఎమ్మెలే విశ్వాసరాయి కళావతి అన్నారు. బాపట్ల జిల్లాలో మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. పాలకొండ నియోజకవర్గాల్లోని పలు చోట్ల భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి సీఎం ప్రసంగాన్ని ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అక్కడకు చేరుకుని తమ అభిమాన నాయకుడి ప్రసంగాన్ని వీక్షించారు. చప్పట్లు కొడుతూ.. ఈలలు వేస్తూ మద్దతు తెలిపారు. జై జగన్ నినాదాలతో ప్రాంగణాలన్నీ మార్మోగిపోయాయి. పాలకొండ పట్టణంలోని నాగవంశపు కూడలిలో ఏర్పాట్లు చేసిన స్క్రీన్‌పై జగనన్న ప్రసంగాన్ని పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కళావతి వీక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్, పాలకొండ